# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 144 వ భాగం

## సూర్య వంశం – 12, రామ కథ - 2

వారధిని దాటిన వాయుసుతుడు చేసిన పని ఏమిటంటే, 'కొంచెం సీత ఎక్కడుందో చూసి రా' అంటే లంక అంతా కాల్చి వచ్చాడు. దీన్ని పోతన ఎలా వివరిస్తున్నాడో చూడండి.

క. సముదగ్రత ననిలసుతుం
దమరాహిత దత్త వాల హస్తాగ్నుల భ
స్మము చేసె నిరాతంకన్
సముదాసురసుభటవిగతశంకన్ లంకన్. [9-277]

వ. ఇట్లు లంకాదహనంబు చేసివచ్చి వాయుజుండు సీతకథనంబు చెప్పిన విని రామచంద్రుండు వనచరనాథ యూథంబులుం దానును చనిచని. [9-278]

అనిలసుతుడు – వాయు పుత్రుడు, లంకని (అమరాహితులు–రాక్షసులు ఉండేదాన్ని) తోకకి ఉన్న అగ్నితో భస్మం చేసాడు. ఈ లంకా నగరానికి భయం అనేదే లేదు రాక్షస భటుల (సముదాసుర సుభటలు) వల్ల; అయినా సరే హనుమంతుడు దాన్ని కాల్చగలిగాడు. ఇదెలా సాధ్యం అనేది ముందు పద్యంలో హనుమంతుణ్ణి గురించి చెప్తూ అన్నాడు కదా ఆయన ఎటువంటివాడో – మతిమంతున్, బలవంతున్, శౌర్యవంతు, ప్రాభవవంతున్. ఇలా వచ్చి సీత సమాచారం చెప్పగానే రాముడు కోతుల గుంపుతో (వనచరనాథ యూథంబులు) సముద్రం దగ్గిరకి వచ్చాడు.

శా. ఆ రాజేంద్రుఁడు గాంచె భూరివిధరత్నాగారమున్ మీన కుం
భీరగ్రాహకఠోరమున్ విపుల గంభీరంబు నభ్రభ్రమ
ద్ఘోరాన్యోన్యవిభిన్నభంగభవనిర్ఘోషచ్ఛటాంభఃకణ
ప్రారుద్ధాంబరపారమున్ లవణపారావారముం జేరువన్. [9-279]

వ. కని తనకుఁ ద్రోవ యిమ్మని వేఁడిన నదియు మార్గంబు చూపక మిన్నందిన నా రాచపట్టి రెట్టించిన కోపంబున.
[ 9-280]

రాముడికి – రత్నాలకి నిధి అయినదీ, చేపలూ మొదలైన వాటికి ఆధారమైనదీ, గంభీరమైనదీ, ఉప్పుతోకూడినదీ అయిన సముద్రం చేరువలో కనిపించింది. రెండు, మూడు పాదాల్లో సముద్రం ఎటువంటిదో చెప్పే నోరు తిరగని నారికేళాపాకం గమనించారా? నభ్రభ్రమద్ఘోరాన్యోన్యవిభిన్నభంగభవనిర్ఘోషచ్ఛటాంభఃకణ ప్రారుద్ధాంబరపారమున్ (అభ్ర = ఆకాశమునకు; భ్రమత్ = ఎగిసిపడే; ఘోరన్ = భయంకరముగా; అన్యోన్య = పరస్పరము; విభిన్న = ఢీకొనెడి; భంగ = అలల; భవత్ = వలన కలిగిన; నిర్ఘోష = పెద్ద చప్పుడుచేస్తూ; ఛటత్ = గుంపులు గుంపుల; అంభః = నీటి; కణ = తుంపరలతో; ప్రారుద్ధ = అరికట్టబడిన; అంబర = ఆకాశపు; పారమున్ = అవధులు కలదానిని). ఇటువంటి సముద్రాన్ని దారి ఇమ్మని అడిగితే సముద్రుడు మాట్లాడలేదు.

క. మెల్లని నగవున నయనము
లల్లార్చి శరంబు విల్లు నందిన మాత్రన్
గుల్లలు నాఁచులుఁ జిప్పలుఁ
బెల్లలునై జలధి పెద్ద బీడై యుండెన్. [9-281]

వ. ఇట్లు విపన్నుండగు సముద్రుండు నదులతోఁ గూడి మూర్తి మంతుండయి చనుదెంచి రామచంద్రుని చరణంబులు శరణంబు జొచ్చి యిట్లని స్తుతియించె. [9-282]

కోపం వచ్చి విల్లు అందుకున్నంత మాత్రంచేతనే సముద్రం గుల్లలు, నాచులు, చిప్పలూ పైకి వచ్చి బీడు అయిపోయింది. ఆ సరికి సముద్రుడు పైకి వచ్చి ఇలా అంటున్నాడు.

శా. ఓ కాకుత్స్థకులేశ! యోగుణనిధీ! యో దీనమందార! నే
నీ కోపంబున కెంతవాఁడ? జడధిన్; నీవేమి భూరాజవే?
లోకాధీశుఁడ; వాదినాయకుఁడ; వీ లోకంబు లెల్లప్పుడున్
నీ కుక్షిం బ్రభవించు; నుండు; నడఁగున్; నిక్కంబు సర్వాత్మకా! [9-283]

రాముడి పూర్వులలో ఒకరు, ఇంద్రుడు వృషభంగా మారితే ఆ ఎద్దు మూపురం ఎక్కి దేవతలకి సహాయంగా యుద్ధంచేసాడు కనక ఆయనకి కకుస్థుడనే పేరు వచ్చిందని (రసగుళికలు-138) లో చదివాం. ఇదే పేరుతో సముద్రుడు రాముడితో అంటున్నాడు. కాకుత్స్థకులేశా, నీ కోపానికి నేనెంతవాణ్ణి. నీలో ప్రభవిస్తూ ఉంటాయి కదా లోకాలన్నీ? సర్వాత్మకుడివైన నువ్వు కోపం విడిచిపెట్టు.

క. కట్టుము సేతువు; లంకం
జుట్టుము; నీ బాణవహ్ని సురవైరితలల్
గొట్టుము నేలంబడఁ; జే
పట్టుము నీ యబల నధికభాగ్యప్రభలన్. [9-285]

సేతువు నిర్మించు, లంకని చుట్టిపెట్టి, నీ బాణాలతో రాక్షసుల తలలు పడగొట్టు నేలమీద పడేలాగ. తర్వాత అధిక భాగ్యప్రభలతో సీతని (నీ అబలని) చేపట్టు. ఇదీ చేయాల్సినది అంతే కానీ నన్ను దారి ఇమ్మనడం సరికాదు. దానికి కూడా కారణాలు చెప్తున్నాడు. పై కందంలో కట్టుము, జుట్టుము, గొట్టుము, పట్టుము అనే పదాలని పోతన ఎంత సులభంగా వాడాడో చూడండి.

ఆ. హరికి మామ నగుదు; నటమీఁద శ్రీదేవి
తండ్రి; నూరకేల తాగడింప?
గట్టఁ గట్టి దాఁటు కమలాప్తకులనాథ!
నీ యశోలతలకు నెలవుగాఁగ [9-286]

లక్ష్మీదేవి తనలోంచి పుట్టినదే కదా, అందువల్ల అంటున్నాడు – శ్రీహరి కి పిల్లనిచ్చిన మామని నేను. నన్ను ఏడిపించడం దేనికి? సేతువు కట్టి నన్ను దాటు, అది నీకు కీర్తి ఇచ్చే పని కదా?

క. ఘన శైలంబులుఁ దరువులు
ఘనజవమునఁ బెఱికి తెచ్చి కపికులనాథుల్
ఘనజలరాశిం గట్టిరి
ఘనవాహప్రముఖదివిజగణము నుతింపన్. [9-288]

వ. ఇట్లు సముద్రంబు దాఁటి రామచంద్రుండు రావణు తమ్ముం డైన విభీషణుండు శరణంబు వేఁడిన నభయం బిచ్చి; కూడుకొని లంకకుఁ జని విడిసి వేడెపెట్టించి లగ్గలుపట్టించిన. [9-289]

పై పద్యంలో “ఘన” అనే పదాన్ని పోతన ఎలా వాడాడో చూడండి. పెద్ద కొండరాళ్ళు (ఘన శైలంబులు), చెట్లు, వేగంగా (ఘన జవమున) పెరికి పట్టుకొచ్చి సముద్రంలో (ఘన జలరాసిన్) వేయడం మొదలుపెట్టారు, ఇంద్రుడు (ఘనవాహ – మేఘాలపై విహరించువాడు) మొదలైన దేవతా గణాలు మెచ్చుకునేటట్టు. లంకలోకి వెళ్ళగానే శరణుజొచ్చిన విభీషణుడికి అభయం ఇచ్చి లంకని ముట్టడించాడు.

వ. అంత నయ్యసురేంద్రుండు పంచినఁ గుంభ, నికుంభ, ధూమ్రాక్ష, విరూపాక్ష, సురాంతక, నరాంతక, దుర్ముఖ, ప్రహస్త, మహాకాయ ప్రముఖులగు దనుజవీరులు శర శరాసన తోమర గదాఖడ్గ శూల భిందిపాల పరశు పట్టిస ప్రాస ముసలాది సాధనంబులు ధరించి మాతంగ తురంగ స్యందన సందోహంబుతో బవరంబు చేయ సుగ్రీవ, పవనతనయ, పనస, గజ, గవయ, గంధమాదన, నీలాం గద, కుముద, జాంబవదాదు లా రక్కసుల నెక్కటి కయ్యంబు లందుఁ దరుల గిరులఁ గరాఘాతంబుల నుక్కడించి త్రుంచి; రంత. [9-291]

యుద్ధం అంతా వివరించకుండా సులభంగా చెప్పేస్తున్నాడు ఒక చిన్న వచనంలో. వానరసేన లంకని ముట్టడించినందుకు రావణుడు పంపిన కుంభ, నికుంభ, ధూమ్రాక్ష, విరూపాక్ష, సురాంతక, నరాంతక, దుర్ముఖ, ప్రహస్త, మహాకాయులని తుదముట్టించారు.

క. ఆ యెడ లక్ష్మణుఁ డుజ్జ్వల
సాయకములఁ ద్రుంచె శైలసమకాయు సురా
జేయు ననర్గళమాయో
పాయు న్నయగుణ విధేయు నయ్యతికాయున్. [9-292]

ఇప్పుడు యుద్ధానికి వచ్చినవాడు పర్వతం అంత శరీరం కలవాడు (శైలసమకాయుడు), దేవతలు కూడా జయించలేనివాడు (సురాజేయుడు), అనేక మాయోపాయాలు గలవాడు (అనర్గళ మాయోపాయుడు), చెడ్డవారికి (అనయగుణ) విధేయుడు అయిన అతికాయుడు. వీణ్ణి లక్ష్మణుడు సంహరించాడు.

ఆ. రామచంద్రవిభుఁడు రణమున ఖండించె
మేటికడిమి నీలమేఘవర్ణు
బాహుశక్తిపూర్ణుఁ బటుసింహనాదసం
కుచిత దిగిభకర్ణుఁ గుంభకర్ణు. [9-293]

అతికాయుడి తర్వాత కుంభకర్ణుడిది వంతు. అతికాయుడంటే ఏదో పర్వతం అంత శరీరం కలవాడు అనొచ్చేమో కానీ కుంభకర్ణుడంటే 'ప్రమాణాద్యస్య విపులం ప్రమాణం నేహవిద్యతే' లేదా వాడింత ఉంటాడు అని చెప్పలేనంత శరీరం ఉన్నవాడుట. వీణ్ణి అతికాయుడితో కలిపి చెప్పడం సరిగ్గానే ఉంది కదా. ఈ కుంభకర్ణుడు సింహనాదం చేస్తే చెవులు దిమ్మెరపోతాయి; అటువంటి వాణ్ణి రాముడు యుద్ధంలో చంపాడు.

క. అలవున లక్ష్మణుఁ డాజి
స్థలిఁ గూల్చెన్ మేఘనాదుఁ జటులాహ్లాదున్
బలభేదిజయవినోదున్
బలజనితసుపర్వసుభటభావవిషాదున్. [9-294]

మేఘనాదుడు నవ్వితే కూడా భయంకరంగా ఉంటుందిట (చటులాహ్లాదున్; చటుల–భయంగా, ఆహ్లాదున్ – నవ్వితే), ఇంద్రుణ్ణి (బలభేది) జయించాడు కదా అందువల్ల ఇంద్రజిత్. దేవతా భటులకి భయం కలిగించేవాడు (సుపర్వ–దేవతల, సుభటా, విషాదున్–భయం కలిగించేవాడు). ఈ మేఘనాదుణ్ణి లక్ష్మణుడు సంహరించాడు.

క. తనవా రందఱు ద్రుగ్గిన
నినిమిషపతివైరి పుష్పకారూఢుండై
యనికి నడచి రామునితో
ఘనరౌద్రముతోడ నంపకయ్యము చేసెన్. [9–296]

తనవారు అందరూ పోయాక అనిమిషపతి (ఇంద్రుడు) వైరి అయిన రావణుడు పుష్పకం ఎక్కి, యుద్ధానికి (అనికి) నడిచి వచ్చి బాణ (అంప) యుద్ధం (కయ్యము) మొదలుపెట్టాడు మహా కోపంతో (ఘన రౌద్రము). వచ్చే వ్యాసంలో రామరావణ యుద్ధం, పోతన చెప్పే మిగతా రామ కథా చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS